# లవ్ స్టోరీ

## “ఐ లవ్ యూ”

“ఐ లవ్ యూ సుధ” అలా అనుకోవడం ఎన్నోసారో నాకు గుర్తులేదు కాని నా హృదయం ఆలాపించే గానం అది. అవును సుధ నా ప్రాణం - సుధ నా జీవం - సుధ నా సర్వస్వం. సుధ లేని జీవితం వ్యర్థం అనిపిస్తుంది. ఇంతకీ సుధ ఎవరు? నిజమే సుధ ఎవరు - నా హృదయంలోకి ఎలా ప్రవేశించింది? తలుచుకుంటేనే గమ్మత్తుగా వుంది!

రోజూ సాయంత్రాలు డాబా పైకి వెళ్ళి షటిల్ ఆడుకునే వాళ్ళం. రోజూ ఆడుకునే మాదిరిగానే ఆ రోజు కూడా డాబా పైకి వెళ్ళి షటిల్ ఆడుతున్నాం. కొంచెం సేపు ఆడిన తరువాత అలసిన శరీరాన్ని గోడకు చేరవేసి కూర్చున్నాను. మా యింటి ముందు డాబాపై కూడా పిల్లలు ఆడుకుంటున్నారు. గట్టిగా అరుస్తున్నారు. కాని నా దృష్టి మాత్రం అప్పుడే విరబూసిన పువ్వులా వున్న అమ్మాయిపై పడింది. వయ్యారంగా మెట్లెక్కుతోంది. ఆమె రెండు జడలు నడకకు అనుగుణంగా ఊగుతూ మరింత అందాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఇంకా చెప్పాలంటే చూడగానే మెచ్చుకునే అందం. చూసి ఊరుకున్నానే తప్ప ఆమెపై అంత ఉత్సుకత చూపించలేదనే చెప్పాలి.

కాని ఆమె నా హృదయంలో అలజడి రేపి తన జ్ఞాపకాలతో ముంచెత్తుందని అనుకోలేదు. ఆ రోజు సాయంత్రం నాకు బాగా గుర్తు. డాబాపై నిలబడి సాయంత్రపు సంధ్యను తిలకిస్తున్న నేను సంధ్య అందాలన్నీ తనలో ఇముడ్చుకొని డాబా పైకి వస్తున్న సుందరిని యథాలాపంగా చూశాను. ఒక్క క్షణం కళ్ళు కలుసుకొన్నాయి. ఏమైందో తెలియదు కాని గుండె వేగం మాత్రం హెచ్చింది. మళ్ళీ చూశాను అటువైపు. నేను ఎలా నిలబడ్డానో అలా నిలబడి ఒక్కసారి వెక్కిరించింది. అందమైన పలువరుస కనిపించేలా కిలకిలా నవ్వింది. ఉలిక్కిపడి చుట్టూ చూశాను. నన్నేనా లేక ఇంకెవరైనా వున్నారా అని. 'నిన్నే' అన్నట్టు వేలు పెట్టి నన్నే చూపిస్తోంది. ఈసారి నా గుండె క్షణం ఆగి మళ్ళీ కొట్టుకోవడం ప్రారంభించింది. ఆ రోజు సరిగ్గా నిద్రపోనేలేదు. కళ్ళు మూసుకున్నా తెరచినా కళ్ళ ముందు అదే రూపం అదే వెక్కిరింపు. ఎప్పుడు సాయంత్రం అవుతుందా అనే ఆరాటం. పైకి వెళ్ళాను - ఆడుతున్నానన్నమాటేగాని మనస్సు మాత్రం ఎదుటి డాబా మెట్ల పైనే.


“ఏంటోయ్! ఈరోజే ఆట నేర్చుకుంటున్నట్టు కొత్తగా ఆడుతున్నావు?” స్నేహితుని మందలింపు చెవిలో పడుతున్నా మనసుకు ఎక్కడం లేదు. బ్యాట్ పక్కనతనికిచ్చి గోడమీద కూర్చుని నిరీక్షిస్తున్నాను. తపస్సు చేసుకునే వాడికి వరాలిచ్చే దైవం ప్రత్యక్షమైనట్టు మెల్లిగా మెట్లు ఎక్కుతోంది. నన్ను నేను మైమరచి చూస్తున్నాను. ఒక్కసారి నా వైపు చూసింది. అప్రయత్నంగా నా చెయ్యి గాలిలోకి లేచింది “హలో” పెదవులు విడీవిడనట్టు కదిలించి చెయ్యి వూపాను. ఆమె కూడా అలాగే అంది. అలా మొదలైన మా పరిచయం దినదిన అభివృద్ధి చెందిందనే చెప్పాలి. రోజూసాయంత్రాలు ఏం చేస్తున్నా డాబా పైకి వెళ్ళే వాడిని. ఆమె కనిపిస్తే చాలు నా మనస్సుకు రెక్కలు వచ్చినట్టు అయ్యేది. ఆ చిలిపి చిరునవ్వు కోసం, కొంటె చూపు కోసం రోజూ తహతహలాడే వాడిని. కనిపించని రోజు ఆ నరకం భరించలేక పోయేవాడిని.

నాలో మార్పు మా వాళ్ళు పసిగట్టినట్టున్నారు. అప్పుడప్పుడూ మాటలతో దెప్పి పొడిచే వారు. “ఎన్నాళ్ళు ఇలా మౌన సందేశాలు! వెళ్ళి ఒక్కసారి మాట్లాడు” అన్నారు. అవును నిజమే! ఎన్నాళ్ళు ఇలా గడపడం? కాని ఎలా వెళ్ళి మాట్లాడడం? ఇంట్లో నుండి బయటికి రాదు. ఒకవేళ వచ్చినా తల్లో, తండ్రో వెంట వుండేవాళ్ళు. కనీసం పేరైనా తెలుసుకోవాలను కొన్నాను. పెద్దగా కష్టపడక మునుపే తెలిసింది పేరు — సుధ. ఆమెకు తమ్ముడున్నాడు.

ఓ రోజు దారిలో వాళ్ళ తమ్ముడిని ఆపాను. “ఏంటోయ్, ఏం చదువుతున్నావ్” అన్నాను. 'నీకెందుకు' అన్నట్టు మొహం పెట్టాడు. “ఏం లేదు-వుత్తినే-పరీక్షలు ఎప్పటి నుండో తెలుసు కుందామని” నోటి కొచ్చింది వాగాను. ఏ మూడ్‌లో వున్నాడో గాని వివరాలు చెప్పాడు ... ఎక్కడ చదివేది కూడా చెప్పాడు.

ఇక వెళ్ళి కలవడమే తరువాయి కాని బద్ధకించాను. ఈ మధ్య డాబాపై ఎక్కువసేపు వుండడం లేదు కాని ఒకసారి వచ్చి అలా వెళ్ళి పోతోంది. ఏమిటి సంగతి? అని అడిగితే పరీక్షలట. అప్పుడు గాని నాకు గుర్తుకు రాలేదు నాకూ పరీక్షలున్నాయని. అతి కష్టం మీద చదువుని బుర్రలోకి ఎక్కిస్తున్నాను. ఒకసారి వెళ్ళి మాట్లాడాలి అనుకుంటూనే వున్నాను. ఎక్కడా వీలుపడడం లేదు. వాళ్ళకి చివరి రెండు పరీక్షలు మాత్రమే వున్నాయని తెలిసి ఆ రోజు వాళ్ళ స్కూలు వైపు వెళ్ళాను. పరీక్ష రాసి అందరూ వస్తున్నారు. కానీ ఏదీ నా హృదయేశ్వరి కనిపించదేం! రెండో రోజు కూడా నిరాశే ఎదురైంది. నా పరీక్షలు కూడా అయి పోయాయి. సెలవులకి ఇంటికెళ్ళాలి. కలవకుండా ఎలా వెళ్ళడం? అందుకే ఆలోచించి ఉత్తరం వ్రాసి ఇవ్వాలని నిర్ణయించుకొన్నాను. సాయంత్రం డాబాపైకి రాగానే “ఒకసారి బయటికి రా, నేను ఊరెడుతున్నాను ప్లీజ్” అంటూ ఎన్నిసార్లు బతిమిలాడినా “బయటకు రావడానికి ఇంట్లో ఒప్పుకోరు” అంటూ సైగలు చేసింది. నా ప్రయత్నం వృధా అయింది. మనస్సు వదిలేసి మనిషిని మాత్రం వూరెళ్ళాను.

రెండు నెలల సెలవులు సుధ జ్ఞాపకాలతో గడిపేశాను. ప్రతి క్షణం గుర్తుకు వచ్చేది. ఏమైందో తెలియదు కాని, ఒకసారి పది రోజుల వరకు నా మొహం కూడా చూడలేదు. ఆమెను ప్రసన్నం చేసుకోవడానికి నేను పడ్డ అవస్థ తలుచుకుంటే నవ్వు వస్తుంది. ఒకసారి కోపం నటిస్తుంది. ఒకసారి ప్రేమ ఒలకబోస్తుంది. అన్నింటినీ తలుచుకుంటూ సెలవలను నెట్టు



కుంటూ గడిపేశాను. ఎప్పుడు వెళ్ళి దాబాపై వాలుదామా అని ఆత్రంగా వుంది.

మళ్ళీ కాలేజీలు తెరిచారు. యథావిధిగా మా మూగారాధన కొనసాగుతోంది. కానీ ఇలా ఎన్నాళ్ళు? అందుకే ఆ రోజు వాళ్ళ స్కూలుకు వెళ్ళాలని నిర్ణయించుకొన్నా. లంచ్ బ్రేక్ - అందరూ బయటికి వస్తున్నారు. నా కళ్ళు అందరినీ అన్వేషిస్తున్నాయి.

అదిగో అదే నడక - అదే జడ ఎక్కడున్నా గుర్తుపట్టగలను. తెల్లటి యూనిఫాంలో దేవకన్యలా ...

“హలో” వెళ్ళి పలుకరించాను. గిరుక్కున వెనుదిరిగింది. జడ సుతారంగా నా చెంపను స్పృశించి వెనక్కి వెళ్ళిపోయింది. ఆమె కళ్ళల్లో ఆశ్చర్యం, ఆనందం ... అంతలోనే మార్పు. ‘ఎవరు నువ్వు’ అనే ప్రశ్న ఆమె భృకుటి మీద!

“మీరు సు......”

“సారీ! మీరు ఎవరో! నన్ను చూసి ఎవరో అనుకుని పొరబడుతున్నారు” అంటూ పక్కనున్నామెను ఉద్దేశించి “రావే పోదాం” అంటూ వెళ్ళిపోయింది.

నా మనసు మొద్దుబారింది. నేను పొర

బతుకుతున్నానా! ఎలా చేరుకున్నానో రూమ్‌కి వెళ్ళి డాబాపై కూర్చున్నాను. చూపులు శూన్యంలో దేన్నో వెతుకుతున్నాయి. టప్‌మని నీటి చుక్క నా చేతిపై పడింది. ఆకాశం మబ్బులు కమ్మి ఏ క్షణంలోనైనా కుండపోత వర్షం పడేలా వుంది. లేవబుద్ధి కావడం లేదు. ఉరుములు, మెరుపులతో ఆకాశం చిల్లుపడ్డట్టు వర్షం. చుట్టూ నీళ్ళు అంతకంతకు పెరిగి అందులో మునిగిపోతే ఎంత బాగుణ్ణు? కన్నీళ్ళు వర్షం నీళ్ళతో కలిసిపోతున్నాయి. గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

నన్నే పిలుస్తున్నట్టుగా వుంటే కళ్ళు తెరిచాను. ఎదురుగా స్నేహితుడు. రెండు రోజుల నుండి జ్వరమట సుధ ... సుధ అని కలవరించావట. ఇంకా అర్థం కాకుండా ఏదో మాట్లాడావట. "ఇలా అయితే లాభం లేదోయ్! నిన్ను పిచ్చాసుపత్రిలో జాయిన్ చేయాల్సి వస్తుంది" అంటున్నాడు మిత్రుడు.

అలా చూస్తూ వుండిపోయాను తప్ప ఏం మాట్లాడలేదు. జ్వరం తగ్గింది. కాలేజీకి వెళుతున్నాను.


రచయిత చిరునామా:
**ఓ. వెంకటేశ్వర్లు**
క్వా. నెం. 1884,
రమేష్‌నగర్, గోదావరిఖని,
505 209


సుధను మరచిపోవాలి అంతే! కాని ఎలా సాధ్యం.

రోజులు దొర్లుతున్నాయి. కాలేజీ నుండి రూముకి వస్తున్నాను. ఎదురుగా సైకిల్ మీద అదే నవ్వు అదే చూపుతో సుధ. మొహం తిప్పుకుని పక్క నుండి వెళ్ళిపోబోతుంటే, "ప్లీజ్ ... ఆగండి" కంఠంలోని అభ్యర్థన కదలనీయకుండా చేసింది. "ఆ రోజు అలా మాట్లాడినందుకు కోపం వచ్చినట్టుంది. సారీ! ఆ రోజు నా పరిస్థితి అది. మా నాన్న గారు పని మీద అక్కడికి వచ్చారు. మీ ఎదురుగానే వున్నారు కాని మీరు చూడలేదు. అందుకే అలా మాట్లాడాను మీరంటే తెలియక కాదు. మీరంటే యిష్టం లేకా కాదు" అంటూ తాను చెప్పదలచినది చెప్పి తుర్రున వెళ్ళిపోయింది. మళ్ళీ నాలో ఆశలు రేపే ప్రయత్నమా, నాతో ఆడుకోవడం లేదు కదా! ఏమో! రూముకెళ్ళి మొహం కడుక్కుని బజారుకని బయలుదేరుతున్నాను. డాబా పైకి చూశాను. సుధ పైకి రమ్మంటూ సైగ చేసింది.

పట్టించుకోకుండా ముందుకు నడవబోయాను. కాని మనసు మాత్రం వెనక్కి లాగుతోంది. వెనక్కి వచ్చి డాబా ఎక్కాను. చిన్నబోయిన ఆమె మొహం విప్పారింది. పెదవుల మీద చిరునవ్వు తొణికిసలాడుతోంది. చిత్రంగా నా హృదయం స్పందించడం నాకే ఆశ్చర్యంగా వుంది. "రేపు రా" అంటూ సైగ చేసింది. అప్రయత్నంగా 'వస్తాను' అన్నట్టుగా తలూపాను. అలవోకగా ఓ ఫ్లయింగ్ కిస్ నా వైపు విసిరి కిందికి వెళ్ళిపోయింది. రేపు వెళ్ళి "ఐ లవ్ యూ" అని నా హృదయం విప్పాలి, అనుకుంటూ దిగాను. "ఐ లవ్ యూ సుధా" ఎన్నిసార్లు అనుకున్నా తనివితీరడం లేదు. ఎలా తీరుతుంది, నా సుధకు చెప్పేదాకా ఈ దాహం తీరదు. అంతే!!